● కాంగ్రెస్ సభకు అధికారుల ఏర్పాట్లు

200 యూనిట్లు ఉచిత కరెంట్, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలను తొలుత రంగారెడ్డి జిల్లా చేవెళ్ల వేదికగా ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రభుత్వ అధికారిక కార్యక్రమం రద్దవ్వడంతో అదే మైదానంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సభ జనజాతరను నిర్వహించింది.

● ప్రభుత్వ వేదికపై కాంగ్రెస్ ఇన్‌చార్జి

మంగళవారం సచివాలయంలో 200 యూనిట్లు ఉచిత కరెంట్, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలను ప్రారంభించిన సందర్భంగా మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. వేదికపై కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క, కొండా సురేఖ, సీఎస్ శాంతికుమారి తదితరులు

సర్కార్ డబ్బు.. కాంగ్రెస్ డప్పు!

- ఖర్చు ప్రభుత్వానిది.. సభ కాంగ్రెస్‌ది
- చేవెళ్లలో రెండు గ్యారెంటీ స్కీంల ప్రారంభానికి పెద్ద ఎత్తున ప్రభుత్వం ఏర్పాట్లు
- సోమవారం అర్ధరాత్రి వరకు శ్రమించిన అధికారయంత్రాంగం
- చేవెళ్ల సభకు రూ.లక్షలు సొమ్మును కుమ్మరించిన సర్కారు
- ఎమ్మెల్సీ కోడ్‌తో రాత్రికి రాత్రే 'జన జాతర' సభగా నిర్వహణ
- ప్రజాధనం దుర్వినియోగంపై ప్రజల మండిపాటు

హైదరాబాద్ సిటీబ్యూరో, రంగారెడ్డి, ఫిబ్రవరి 27(నమస్తే తెలంగాణ): 'సొమ్మొకరిది.. సోకొకరిది' అంటే ఇదేనేమో! ప్రభుత్వ సొమ్ముతో అట్టహాసంగా ఏర్పాట్లు చేసిన సభలో కాంగ్రెస్ సొంత డప్పు కొట్టుకున్నది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలను ప్రారంభించేందుకు రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ఫరా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ ప్రాంగణాన్ని ప్రభుత్వం ఎంచుకొని సభకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీతో ఈ వేదిక మీద నుంచి ఈ రెండు పథకాలను ప్రారంభించాలని తొలుత భావించారు. చివరి నిమిషంలో ఆమె పర్యటన రద్దు కావడంతో వర్చువల్ విధానంలో ప్రారంభించాలని భావించి అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. అంతవరకు బాగానే ఉన్నా సోమవారం రాత్రి ఉన్నట్టుండి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో అధికారిక కార్యక్రమాన్ని సచివాలయానికి మార్చి, ఆ వేదికను మాత్రం రాత్రి కిరాత్రే కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల ప్రచార సభ 'జనజాతర'గా మార్చేశారు. ఇది చూసి ప్రజలు విస్మయం చెందారు. ప్రభుత్వ సొమ్ముతో కాంగ్రెస్ సభ నిర్వహించిందంటూ సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి.

ప్రజాధనం దుర్వినియోగం

ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా 200 యూనిట్లు ఉచిత కరెంట్, రూ.500 గ్యాస్ సిలిండర్ పథకాలను చేవెళ్ల వేదికగా మంగళవారం ప్రారంభించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభించనుండటంతో అధికారయంత్రాంగం కొన్ని రోజులుగా చెమటోడ్చింది. ఫరా కళాశాల ప్రాంగణంలో సభ నిర్వహణకు సంబంధించి కలెక్టర్‌తో సహా వివిధశాఖల అధికారులు వరుసగా ఐదు రోజుల పాటు పర్యవేక్షించారు. లక్షమంది మహిళలను సభకు తరలించేలా ఏర్పాట్లు జరిగాయి. డీఆర్డీవో, మెప్మా అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మూడు జిల్లాల నుంచి 15 వేల మందిని, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లా నుంచి మూడు వేలమంది చొప్పున మహిళలను సభకు రప్పించేలా మౌఖిక ఆదేశాలు వెళ్లడంతో అధికారులు ఆ దిశగా ఏర్పాట్లు చేశారు. స్టేజీ ఏర్పాటుతోపాటు సభా ప్రాంగణానికి సమీపంలో హెలిప్యాడ్ నిర్మించారు. మహిళల తరలింపు కోసం ఆర్టీసీ బస్సులను బుక్ చేశారు. సోమవారం రాత్రి వరకు కలెక్టర్‌తోపాటు అధికార యంత్రాంగం ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించింది. ఇందుకుకోసం లక్షలాదిరూపాయల ప్రజాధనాన్ని కుమ్మరించింది. అంతలోనే మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయడంతో చేవెళ్ల సభ నిర్వహణపై సందిగ్ధత నెలకొన్నది. సోమవారం రాత్రి వరకు ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు వెనుదిరిగారు. కాంగ్రెస్ పెద్దలు మాత్రం సభ నిర్వహణకే మొగ్గు చూపారు. రెండు గ్యారెంటీల ప్రారంభోత్సవాన్ని సచివాలయంలోనే కానిచ్చేసి సభను 'జనజాతర'గా మార్చేసి చేవెళ్లలో నిర్వహించారు. మంగళవారం నాటి సభకు ప్రజలు బస్సులు, జీపులు, ఇతర వాహనాల్లో పెద్ద ఎత్తున తరలించారు. రాజకీయ సభగానే కాంగ్రెస్ నేతలు అభివర్ణించుకుంటున్నప్పటికీ అధికార సభనే తలపించింది. ప్రజాధనం రూ. కోట్లలో దుర్వినియోగం అయ్యిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాల జాతర సందర్భంగా కోస్గిలో నిర్వహించిన ప్రభుత్వ అధికారిక సభలో సీఎం రేవంత్‌రెడ్డి అధికార యంత్రాంగం సమక్షంలోనే పార్టీ సభలా వంశీచంద్‌రెడ్డిని పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించడంపైనా విమర్శలు వెల్లువెత్తాయి.

సగం మందికే సబ్సిడీ గ్యాస్

- ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకొంటేనే సబ్సిడీ
- దరఖాస్తుదారుని పేరుతో గ్యాస్ కనెక్షన్ తప్పనిసరి
- తెల్ల రేషన్‌కార్డుదారులకే పథకం వర్తింపు
- గత మూడేండ్ల సగటు ఆధారంగా సిలిండర్ల కేటాయింపు
- బుకింగ్ సమయంలో మొత్తం బిల్లు చెల్లించాల్సిందే
- ఆ తర్వాత లబ్ధిదారుల ఖాతాల్లో సబ్సిడీ జమ
- మహాలక్ష్మి పథకం విధి విధానాలు విడుదల చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): మహాలక్ష్మి పథకంలో భాగంగా తెల్ల రేషన్‌కార్డు ఉన్నవారందరికీ రూ.500లకే వంటగ్యాస్ పథకాన్ని అమలు చేస్తామని గతంలో ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ, తీరా అమలు సమయంలో అనేక షరతులు విధిస్తున్నది. ఈ పథకంలో లబ్ధి పొందేందుకు మూడు ప్రధాన షరతులు విధించింది. ఈ మేరకు పథకం అమలు విధి విధానాలను మంగళవారం విడుదల చేసింది. ఈ ఉత్తర్వుల్లోనూ పలు అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో గందరగోళం నెలకొన్నది.

40 లక్షల మందికే సబ్సిడీ గ్యాస్

రూ.500లకే గ్యాస్ పథకాన్ని ప్రస్తుతానికి ప్రభుత్వం 40 లక్షల మంది వినియోగదారులకే అమలు చేయనున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది. మంత్రులు మాత్రం తెల్ల రేషన్‌కార్డు ఉన్నవారందరికీ ఈ పథకాన్ని అమలు చేస్తామని గతంలో ప్రకటించారు. ఇప్పుడు ఆ సంఖ్యను 40 లక్షలకే పరిమితం చేయడంపై ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలో సుమారు 90 లక్షల తెల్ల రేషన్‌కార్డులున్నాయి. 1.24 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. తెల్ల రేషన్‌కార్డుతోపాటు గ్యాస్ కనెక్షన్ ఉన్న వారి వివరాలను ఇటీవల పౌరసరఫరాల సంస్థ లెక్కతీసింది. ఈ రెండు ఉన్నవారు సుమారు 65 లక్షల మంది ఉంటారని అంచనా వేసింది. ప్రభుత్వం 40 లక్షల మందికి మాత్రమే సబ్సిడీ గ్యాస్ ఇచ్చి చేతులు దులిపేసుకునే ప్రయత్నం చేస్తున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మిగిలిన 25 లక్షల మంది పరిస్థితి ఏంటనేదానిపై స్పష్టత లేదు. ప్రభుత్వం ఈ 40 లక్షల మంది అర్హులను ఏ ప్రాతిపదికన ఎంపిక చేసింది? 25 లక్షల మందిని ఎందుకు ఎంపిక చేయలేదనేదానిపైనా స్పష్టత కరువైంది. అయితే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ మాత్రం ఇది నిరంతర ప్రక్రియ అని, అర్హుల జాబితాలో పేరులేనివారు ఎమ్మార్వో వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వం విధించిన షరతులు

సబ్సిడీ గ్యాస్ పొందాలంటే సదరు లబ్ధిదారు ఇటీవల నిర్వహించిన ప్రజా పాలనలో సబ్సిడీ గ్యాస్ పథకానికి కచ్చితంగా దరఖాస్తు చేసుకొని ఉండాలి.

దరఖాస్తుదారులకు కచ్చితంగా తెల్ల రేషన్ కార్డు ఉండాలి.	దరఖాస్తుదారుని పేరుపై యాక్టివ్ గ్యాస్ కనెక్షన్ ఉండాలి.

ఈ పథకంలో ఇచ్చే సిలిండర్ల సంఖ్యపై పరిమితి ఉంటుంది. గత మూడేండ్లుగా సదరు వ్యక్తి వినియోగించిన (బుక్ చేసిన) గ్యాస్ సిలిండర్ల సంఖ్య సగటును లెక్కించి దాని ఆధారంగా సబ్సిడీ గ్యాస్ సిలిండర్ ఇస్తారు.

మొత్తం డబ్బులు చెల్లించాల్సిందే

సబ్సిడీ గ్యాస్ పథకంలో భాగంగా గ్యాస్ బుక్ చేసుకునే వినియోగదారులు ముందుగా మొత్తం డబ్బును కంపెనీలకు చెల్లించాల్సి ఉంటుంది. ఆ తర్వాత సబ్సిడీ సొమ్ము ప్రభుత్వం గ్యాస్ కంపెనీలకు అందిస్తే.. అవి వినియోగదారులకు డీబీటీ ద్వారా వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తాయి. అంటే ఈ పథకం అమల్లోకి వచ్చిన తర్వాత కూడా గ్యాస్ బుక్ చేసుకునే వినియోగదారులు రూ.955 చెల్లించాల్సిందే. ఆ తర్వాత సబ్సిడీ రూ.455 వినియోగదారుల ఖాతాలో జమవుతాయి. అయితే ఈ సబ్సిడీ డబ్బు ఎప్పుడు జమవుతుందనేదానిపై కూడా స్పష్టత లేదు.

ప్రజల సందేహాలు

- గ్యాస్ కనెక్షన్ కేవలం మహిళల పేరుపై ఉంటేనే ఈ పథకం వర్తిస్తుందా? లేక మగవాళ్ల పేర్లపై ఉన్నా వర్తిస్తుందా?
- సొంత గ్రామాల్లో ప్రజా పాలన దరఖాస్తు చేసినవారికి హైదరాబాద్‌లో గ్యాస్ కనెక్షన్ ఉంటే వారికి ఈ పథకం వర్తిస్తుందా? వర్తించదా?
- సబ్సిడీ సిలిండర్ల కేటాయింపునకు మూడేండ్ల వినియోగ సగటును పరిగణనలోకి తీసుకుంటున్నారు. అలాంటప్పుడు కొత్తగా గ్యాస్ కనెక్షన్ తీసుకున్న వారికి ఈ పథకం వర్తిస్తుందా? లేదా?
- తెల్ల రేషన్‌కార్డు ఉన్నప్పటికీ ప్రజాపాలనలో దరఖాస్తు చేయకపోతే ఈ పథకం వర్తించదా?
- ప్రస్తుతం కేంద్రం ఇస్తున్న రూ.40 సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలో కలుపుతుందా? లేదా?

ఆంక్షలు గ్యారెంటీ!

మొదటిపేజీ తరువాయి...

చెప్పవచ్చు. అంటే లక్షల మంది జీరో బిల్లుకు దూరం కానున్నారు.

- నగరాల్లో సొంత ఇండ్లు ఉన్నవారికంటే ఉద్యోగం కోసమో, ఉపాధి కోసమో వలస వచ్చి కిరాయికి ఉంటున్న కుటుంబాలే ఎక్కువ సంఖ్యలో ఉంటాయి. వారంతా కరెంటు బిల్లుల భారం మోయాల్సిందేనని మార్గదర్శకాలను బట్టి స్పష్టమవుతున్నది. హైదరాబాద్, వరంగల్ వంటి నగరాలతోపాటు మున్సిపాలిటీల్లోనూ ఇలాంటి పరిస్థితే ఉండనున్నది. అక్కడ సొంత ఇండ్లు ఉన్న వారికంటే అందులో కిరాయికి ఉండే కుటుంబాలే ఎక్కువగా ఉంటాయి. ఉదాహరణకు ఒక ఇంట్లో నాలుగు అంతస్థుల్లో ఎనిమిది పోర్షన్లు ఉంటే.. ఎనిమిది కనెక్షన్లు ఉంటాయి. కానీ ఒక్క కనెక్షన్‌కు మాత్రమే గృహజ్యోతి వర్తిస్తుంది. మిగతా 7 కనెక్షన్లలో ఉండే కిరాయిదారులకు తెల్లరేషన్ కార్డు ఉన్నా విద్యుత్తు బిల్లుల మోత తప్పదు. ఈ లెక్కన కోటి కనెక్షన్లలో దాదాపు సగం కుటుంబాలకు గృహజ్యోతి అందక కరెంటు బిల్లుల భారం తప్పదన్నమాట.
- చాలా కుటుంబాల్లో అన్నదమ్ములు వేర్వేరుగా ఉన్నా .. ఇప్పటికీ రేషన్‌కార్డు ఉమ్మడిగానే ఉన్నది. అనేక రేషన్ కార్డుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. నిబంధనలను బట్టి వీరిలో ఒక్కరికే గృహజ్యోతి అందుతుందని స్పష్టమవుతున్నది.
- చాలా కుటుంబాల్లో అన్నదమ్ముల కుటుంబాలకు వేర్వేరుగా రేషన్ కార్డులు ఉన్నా.. ఒకే ఇంట్లో ఉంటున్నవారు ఉన్నారు. వారిలో ఒక్క రేషన్‌కార్డుకు మాత్రమే జీరో బిల్లు వస్తుందన్నమాట.

గృహజ్యోతి మార్గదర్శకాలు

- రాష్ట్రంలోని ప్రతి ఇంటికి ఒక కనెక్షన్‌కు ఈ పథకం వర్తిస్తుంది.
- ప్రజాపాలన లేదా ఇతర అధికారిక మార్గాల ద్వారా స్వీకరించిన దరఖాస్తుల్లో ఆధార్‌తో అనుసంధానమైన తెల్ల రేషన్ కార్డు, గృహ విద్యుత్తు కనెక్షన్ నంబర్ ఉన్న వాటికి ఈ పథకం వర్తిస్తుంది.
- అర్హులైన ఇంటికి 200 యూనిట్ల వరకు '0' బిల్లు అందజేయాలి.
- జీరో బిల్లు కోసం డిస్కంలు ప్రత్యేకంగా వినియోగదారుల పేర్లను మార్చాల్సిన అవసరం లేదు. ఇప్పుడున్న పేర్లతోనే బిల్లులు మంజూరు చేయాలి.
- డిస్కంలు జీరో బిల్లులను ప్రభత్వానికి పంపిస్తే, ప్రతి నెలా 20వ తేదీనాటికి ప్రభుత్వం ఆ రాయితీ మొత్తాన్ని డిస్కంలకు చెల్లిస్తుంది.
- గృహజ్యోతి కనెక్షన్‌ను వ్యాపార అవసరాలకు వినియోగించినట్టు తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారు.
- ఒకవేళ ఎవరైనా అన్ని అర్హతలు ఉండి, ఈ పథకం కింద జీరో బిల్లు రాకపోతే సంబంధిత ఎంపీడీవో కార్యాలయంలో లేదా మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో లేదా సర్కిల్ కార్యాలయంలో సంప్రదించాలి. రేషన్‌కార్డు, విద్యుత్తు కనెక్షన్‌కు సంబంధించిన యూఎస్‌సీ వివరాలతో ప్రజాపాలన పోర్టల్ ద్వారా మరోసారి దరఖాస్తు చేసుకోవాలి. అధికారుల నుంచి రసీదు తీసుకోవాలి.
- పరిశీలన అనంతరం అర్హులని తేలితే.. ఆ మరుసటి నెల నుంచి జీరో బిల్లు మంజూరు చేస్తారు. అప్పటికే కట్టిన బిల్లులు తిరిగి ఇవ్వడం కుదరదు.

సోనియా ఇచ్చిన ప్రతి హామీ అమలు

- ఆమె మాటల్ని సువర్ణాక్షరాలతో లిఖిస్తాం
- ఆరు గ్యారెంటీలను 100 శాతం అమలుచేస్తాం
- మహాలక్ష్మి పథకం ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): సోనియాగాంధీ మాటే శిలా శాసనమని, ఆ శిలా శాసనాన్ని చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించే విధంగా కాంగ్రెస్ ముందుకెళ్తుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రజలకు సోనియా గాంధీ ఇచ్చిన ప్రతి హామీని కచ్చితంగా అమలుచేసి తీరుతామని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ. 500లకే గ్యాస్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు పథకాలను మంత్రులతో కలిసి సీఎం ప్రారంభించారు. సీఎం మాట్లాడుతూ... అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే రెండు గ్యారెంటీలను అమలు చేశామని తెలిపారు. ఇప్పుడు వంటగ్యాస్, ఉచిత విద్యుత్తు పథకాలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఆడబిడ్డలు కట్టెల పొయ్యి తో పడే ఇబ్బందులను తొలగించేందుకు యూపీఏ ప్రభుత్వంలో దీపం పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు ఇచ్చారని తెలిపారు. అప్పుడు రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ ధరను ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం రూ.1,200కు పెంచిందని విమర్శించారు. ఇప్పుడు పేదలకు ఆ భారాన్ని తగ్గించేందుకు రూ.500కే గ్యాస్ పథకాన్ని అమలు చేస్తున్నట్టు వెల్లడించారు.

ఎల్ ఆర్ ఎస్ అప్పుడు వద్దన్నరేం?

- ఇప్పుడెలా కొనసాగిస్తున్నరు
- కేసీఆర్ నిర్ణయాలన్నీ ప్రజల సంక్షేమానికే : వినోద్

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 27: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎల్ఆర్ఎస్‌ను వ్యతిరేకించిన కాంగ్రెస్, నేడు పాలకపక్షంలోకి వచ్చాక ప్రభుత్వ ఖజానాను నింపుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నదని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ విమర్శించారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలని, మార్చిలోపు లేఅవుట్లను క్రమబద్ధీకరించాలని సీఎం ఆదేశాలు జారీ చేశారన్నారు. లేఅవుట్ల క్రమబద్ధీకరణలో భాగంగా పేదలు నిర్మించుకునే ఇండ్ల అనుమతులు, రుణాల మంజూరుకు సంబంధించిన అనుమతుల సులభతరం కోసమే కేసీఆర్ సర్కార్ ఎల్ఆర్ఎస్‌ను అమల్లోకి తెచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగానే కాంగ్రెస్ నేతలు విస్మరిస్తున్నారని మండిపడ్డారు. ఫీజు లేకుండా ఎల్ఆర్ఎస్‌ను అమలుచేయాలని డిమాండ్ చేశారు.

జవానుకే కాంగ్రెస్ కార్యకర్త బెదిరింపు

- ప్లాటు అమ్మి రిజిస్ట్రేషన్ చేయకుండా దౌర్జన్యం
- జవాను ఫిర్యాదుతో సదరు వ్యక్తికి జైలు శిక్ష

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 27: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌కు చెందిన సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ భూక్యా నరేశ్ గంభీరావుపేట మండలం నాగంపేటకు చెందిన నర్ర లింగారెడ్డి వద్ద ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలో రూ.41.76 లక్షలకు ఓ ప్లాటు కొనుగోలు చేశారు. అడ్వాన్సుగా రూ.15.50 లక్షలు ఇచ్చారు. మిగతా సొమ్ము చెల్లించేందుకు ఆలస్యమైంది. లింగారెడ్డి కొడుకు నర్ర విద్యాసాగర్‌రెడ్డి (ఇటీవలే కాంగ్రెస్‌లో చేరారు) రిజిస్ట్రేషన్ కోసం అదనంగా రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. నరేశ్ ఫిర్యాదుతో పోలీసులు విద్యాసాగర్ రెడ్డి, లింగారెడ్డిపై కేసు నమోదు చేశారు. విద్యాసాగర్‌రెడ్డిని జైలుకు తరలించినట్టు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

బీఆర్ఎస్‌ను ఒక్క సీటూ గెలువనివ్వం

- అల్లాటప్పాగా అధికారంలోకి రాలేదు
- నల్లమల నుంచి వచ్చా.. అడ్డువచ్చిన ఎందరినో తొక్కుకుంటూ వచ్చా..
- చేవెళ్ల సభలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి (నమస్తే తెలంగాణ): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఒక్క సీటు కూడా గెలువనివ్వబోమని ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సవాల్ చేశారు. 'ఇదే నా సవాల్.. దమ్ముంటే ఒక్క సీట్లైనా గెలిపించి చూపించాలి' అన్నారు. ఐదు వందలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు పథకాలకు శ్రీకారం చుట్టిన సందర్భంగా మంగళవారం సాయంత్రం చేవెళ్లలో జరిగిన బహిరంగసభలో రేవంత్ మాట్లాడారు. ప్రతిపక్ష బీఆర్ఎస్, కేంద్రంలోని బీజేపీ సర్కార్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తమ ప్రభుత్వాన్ని కూల్చితే కూలిపోవడానికి తామేమీ అల్లాటప్పాగా అధికారంలోకి రాలేదని అన్నారు. లాఠీ దెబ్బలు తిని, అక్రమ కేసులను ఎదుర్కొని, చర్లపల్లి, చంచల్‌గూడ జైళ్లలో ఉండి అధికారంలోకి వచ్చామనే విషయాన్ని మరిచిపోవద్దని అన్నారు. నల్లమల నుంచి వచ్చిన తాను అడ్డువచ్చిన వారిని ఎందరినో తొక్కుకుంటూ వచ్చి ఈ కుర్చీలో కూర్చున్నానని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా 14 సీట్లు గెలిచి తీరుతుందని ధీమా వ్యక్తంచేశారు. తాము ఎన్నికలలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీని నిలబెట్టుకునేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామని అన్నారు.

గుజరాత్ మాడల్ అంటే ప్రభుత్వాలను కూల్చడమా?

బీజేపీ నేతలు గుజరాత్ మాడల్ తీసుకొస్తామంటూ ప్రచారం చేస్తున్నారని.. అంటే పార్టీలను చీల్చడమా? లేక ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చివేయడమా? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. తాము అధికారంలోకి వస్తే ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రధాని చెప్పారని, పదేండ్లలో ఇవ్వాల్సిన 20 కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయో సమాధానం చెప్పాలని నిలదీశారు.

బీజేపీ నేత ప్రభాకర్‌కు మున్షీ నోటీసు

ఎంపీ టికెట్ కోసం కాంగ్రెస్ నాయకుడు ఒకరు ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకి బెంజికారు కొనిచ్చినట్టు బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ చేసిన ఆరోపణలపై ఆమె స్పందించారు. ప్రభాకర్‌కు ఆమె లీగల్ నోటీసు పంపించారు. తనపై చేసిన ఆరోపణలకు రెండు రోజుల్లో ఆధారాలు చూపించాలని, లేనిపక్షంలో రూ.10 కోట్లకు పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు.

ర్యాడిసన్ డ్రగ్స్ కేసులో డైరెక్టర్ క్రిష్?

- హోటల్ యజమాని కొడుకే పార్టీల నిర్వాహకుడు
- డ్రగ్స్ సరఫరా చేస్తున్నది హోటల్ మాజీ ఉద్యోగి
- ఇప్పటికి 10సార్లు కొకైన్ సరఫరా చేసినట్టు ఒప్పకోలు
- డ్రగ్స్‌లో మరోసారి టాలీవుడ్ ప్రముఖుల ప్రమేయం
- డైరెక్టర్ క్రిష్, నిర్మాత కేదారీనాథ్‌పై కూడా ఎఫ్ఐఆర్

కొండాపూర్/హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): గచ్చిబౌలి ర్యాడిసన్ హోటల్ డ్రగ్స్ కేసులో మరోమారు సినీ ప్రముఖుల పేర్లు బయటకు రావడం సంచలనంగా మారింది. హోటల్‌లో నిర్వహించిన డ్రగ్స్ పార్టీలో పలువురు వ్యాపార వేత్తలతోపాటు టాలీవుడ్‌కు చెందిన దర్శకుడు క్రిష్, నిర్మాత కేదారినాథ్, నటి లిపి గణేశ్ సైతం పాల్గొన్నట్టు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. డ్రగ్స్ పార్టీ కోసం కొకైన్‌ను సప్లయ్ చేసిన సయ్యద్ అబ్బాస్ అలీ జెఫ్రీని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ర్యాడిసన్‌లో తరచుగా డ్రగ్స్ పార్టీలు నిర్వహించుకుంటామని ఆ హోటల్ యజమాని కొడుకు వివేకానంద పోలీసుల విచారణలో వెల్లడించాడు. వివేకానందకు ఇప్పటివరకు పదిసార్లు కొకైన్ సరఫరా చేసినట్టు అబ్బాస్ అలీ తెలిపాడు. డ్రగ్స్ పార్టీకి హాజరైన వివేకానంద అతని స్నేహితులు నిర్భయ్, రఘు చరన్, కేదార్, సందీప్, శ్వేత, లిపి, నీల్, క్రిష్‌తోపాటు అందరినీ నిందితులుగా చేర్చారు. డ్రగ్స్ వాడకాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉక్కుపాదంతో అణచివేసింది, అదే తోవలో ప్రస్తుత ప్రభుత్వం కూడా నడుస్తున్నది. హోటల్ యజమాని కొడుకు ఇచ్చే డ్రగ్స్ పార్టీలకు సినీ ప్రముఖులు, వ్యాపారులు వచ్చిపోతుంటారని విచారణలో వెల్లడైంది. నిందితుల ఫోన్లను పోలీసులు విశ్లేషిస్తున్నారు.

పరీక్షలు చేస్తాం: మాదాపూర్ డీసీపీ

ఈ కేసులో నిందితులుగా ఉన్న శ్వేత, సందీప్ పరారీలో ఉన్నారని, చరణ్ బెంగుళూర్‌లో ఉన్నా, వస్తానని చెప్పాడని మాదాపూర్ డీసీపీ వినీత్ తెలిపారు. డ్రగ్స్ తీసుకున్న అనుమానితుల జాబితాలో డైరెక్టర్ క్రిష్ ఉన్నాడని, డ్రగ్ పరీక్షల కోసం వస్తానని చెప్పాడని వెల్లడించారు. హోటల్ నిర్వాహకులపై కేసు నమోదు చేస్తామని, అబ్బాస్ ఎక్కడి నుంచి డ్రగ్ తెస్తున్నాడనే దానిపై ఆరా తీస్తున్నామని తెలిపారు.

టాలీవుడ్‌కు చుట్టుకుంటున్న ర్యాడిసన్ డ్రగ్స్

గచ్చిబౌలి ర్యాడిసన్ డ్రగ్స్ కేసులో డొంకంతా కదులుతున్నది. ఈ నెల 25న మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో గచ్చిబౌలిలోని ర్యాడిసన్ బ్లూ హోటల్ రూమ్ నం. 1200, 1204లో డ్రగ్స్ పార్టీ ప్రారంభం కాగా, పోలీసులకు రాత్రి సమాచారం అందింది. దీంతో పోలీసులు రాత్రి 12:30 గంటలకు హోటల్‌పై దాడి చేశారు. హోటల్ గదుల్లో డ్రగ్స్ వాడేందుకు ఉపయోగించే ప్లాస్టిక్ కవర్లు, వైట్ పేపర్లు, సెల్‌ఫోన్లు లభించాయి. హోటల్ సిబ్బందిని విచారించగా, సదరు గదుల్లో తమ హోటల్ డైరెక్టర్ గజ్జెల వివేకానంద తన స్నేహితులతో కలిసి పార్టీ చేసుకున్నాడని చెప్పారు. పోలీసులు వచ్చే కొద్ది సమయం ముందే వివేకానంద ఇంటికి వెళ్లిపోయారు. దీంతో పోలీసులు జూబ్లీహిల్స్‌లోని వివేకానంద ఇంటికి వెళ్లగా, ఉదయం 6 గంటల వరకు ఆయన ఇంటి గేటు తీయలేదు. చివరికి వివేకానందను అదుపులోకి తీసుకుని విచారించగా, 10 మంది స్నేహితులతో కలిసి పార్టీ చేసుకున్నట్టు తెలిపాడు.

డ్రగ్ కేసులో సినీ ప్రముఖులు...

టాలీవుడ్ నిర్మాత కేదారినాథ్, మరో టాలీవుడ్ ప్రముఖ హీరోతో జూబ్లీహిల్స్‌లో పలు పబ్‌లను నిర్వహిస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే క్రిష్ మీద కేసు నమోదు చేసిన పోలీసులు విచారణకు రావాలని నోటీసులు జారీ చేశారు. టాలీవుడ్ ప్రముఖ నటి లిపి గణేశా, యూట్యూబర్ శ్వేత సైతం డ్రగ్స్ పార్టీలో ఉన్నట్టు పోలీసులు గుర్తించి వీరి మీద కూడా కేసు నమోదు చేశారు.